జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు

- మేయర్ హరివెంకట కుమారి
- వైద్య శిబిరానికి పోటెత్తిన ప్రజలు
- ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ


రోగితో మాట్లాడుతున్న మేయర్ హరివెంకట కుమారి


ఓపీలో పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది


వృద్ధురాలికి జగనన్న బ్యాగ్ అందజేస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

ఆరిలోవ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మలేరియా, టీబీ మందులతో పాటు, అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు నిత్య పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలు పదర్శించారు. వీటిని మేయర్ పరిశీలించారు. శిబిరానికి వెళ్లే రోగుల కోసం ఓపీ, మందులు పంపిణీ చేసే కౌంటర్, కన్సల్టెన్సీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా వైద్యులే ప్రజల వద్దకు వచ్చి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఈ శిబిరంలో ఐదుగురు స్పెషలిస్టులతో రోగులకు సేవలు అందించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రజలు ఈ శిబిరాలలో వైద్య సేవలను సద్వినియోగపరుచుకోవాలని ఆమె సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ సచివాలయాల వారిగా యూపీహెచ్‌సీలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాలాజీనగర్ యూపీహెచ్‌సీ వైద్యధికారి కిరణ్ లలిత మాట్లాడుతూ 18, 19, 31, 32 సచివాలయాల పరిధిలో ప్రజలు కోసం ప్రస్తుతం ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిగిలినవాటికి నవంబరు 9,10 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం 458 మందికి సేవలు అందించామన్నారు. వారిలో అవసరమైన 20 మందికి ఆరోగ్యమిత్రలో సర్జరీల కోసం పలు కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్, మలేరియా, టీబీ, పారిశుధ్యం, అంగన్‌వాడీ విభాగాలు సిబ్బంది, ఆశా వర్కర్లు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


ఆహార పదార్థాల ప్రదర్శన

వృద్ధులకు బాసటగా..



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంతో మాలాంటి వృద్ధులకు ఎంతో మేలు కలుగుతుంది. 80 ఏళ్లు దాటిన నేను ఎటూ కదలలేకపోతున్నాను. ఇంటికి దగ్గరగా ఉండటంతో ఈ శిబిరంలో కంటి సమస్య గురించి డాక్టర్‌కు చూపించాను. కంటి పరీక్షలు చేశారు. మందులు ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– కడియం చిరంజీవిరావు, బాలాజీనగర్, ఆరిలోవ

ఉచిత వైద్యం బాగుంది



మా బాబుకు జ్వరం, జలుబు వచ్చింది. దీని కోసం ఈ శిబిరంలో డాక్టర్‌కు చూపించడానికి తీసుకొచ్చాను. ఎలాంటి ఫీజు లేకుండా డాక్టర్ పరీక్షించారు. సిరప్, మాత్రలు ఇచ్చారు. ఇక్కడ సిబ్బంది శిబిరానికి రాగానే ఓపీలో పేరు రాయించుకొన్నారు. వెంటవెంటనే అవసరమైన డాక్టర్ వద్దకు పంపించారు. బయట ఆస్పత్రికి వెళ్లకుండా మా వీధిలోనే ఈ శిబిరం ఏర్పాటు చేయడం మాకు ఎంతో సులువైంది.

– చాణిక్యతో తల్లి పావణి, బాలాజీనగర్,

క్లుప్తంగా

బెస్ట్ ఎమర్జింగ్ స్టార్టప్‌గా తారమండల్


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం స్టార్టప్ ఇంక్యుబేషన్‌సెంటర్ ఆ–హబ్‌లో ప్రారంభమైన తారమండల్ స్టార్టప్ సంస్థ బెస్ట్ ఎమర్జింగ్ స్టార్టప్ ఆఫ్ ది ఇయర్ 2023 అవార్డును సాధించింది. ఇటీవల హెడ్‌స్టార్ట్ సంస్థ నిర్వహించి భారత్ పిచ్‌థాన్ 2.0 కార్యక్రమంలో పాల్గొని ఈ అవార్డును సాధించారు. స్పేస్ రంగంలో పనిచేస్తున్న తారమండల్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ఆకాంక్ష వ్యక్తం చేశారు. శనివారం తన కార్యాలయంలో తారమండల్ నిర్వాహకులు ఏ.వినీల్ జడ్సన్, డాక్టర్ డి.రాజేష్, డాక్టర్ ఎం.గౌతమ్, టి.నీలకంఠేశ్వర రెడ్డి, ఎస్. రమ, జయలక్ష్మిలను అభినందించారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తున్న ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు సహకారాన్ని, కృషిని ప్రస్తుతించారు.

రిజిస్ట్రార్‌కు అభినందనలు


జేమ్స్ స్టీఫెన్‌ను అభినందిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను ఏబీవీపీ ఆంధ్రవిశ్వవిద్యాలయం విభాగం నాయకులు అభినందించారు. శనివారం కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్, బాలాజీ, శ్రీధర్, అరుణ్, నిఖిల్, రాజశేఖర్, మధు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుగు పోటీలు


బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

ఏయూక్యాంపస్: విద్యార్థుల్లో శారీరక వ్యాయామం, ఆరోగ్యపరిరక్షణపై అవగాహన కల్పిస్తూ పరుగు పోటీలను నిర్వహించారు. శనివారం స్థాయి ఎంఎల్‌బీటీ పాఠశాలలో విద్యార్థులకు పరుగు పందెం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, కరస్పాండెంట్ వేదుల శ్రీరామ మూర్తి, ఈస్ట్ షిర్డీసాయి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.నర్సింగ రావు, కార్యదర్శి హేతు, బీచ్ వాకర్స్ అసోసియేషన్ కోశాధికారి వి.వి రమణ, పూర్వ అధ్యక్షులు లక్ష్మోజీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యంపై ఫిర్యాదు


వెంకటరమణ (ఫైల్)

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని నక్కవాని పాలెంకు చెందిన చిల్లా వెంకటరమణ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిల్లా వెంకటరమణ (54) నక్కవానిపాలెంలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన గత నెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదు. మరుచటి రోజు అతని కుమారుడు మణికంఠ ఫోన్ చేయగా వచ్చేస్తానని చెప్పాడు. తరువాత అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఐదు రోజులైనా తిరిగి రాకపోవడం మణికంఠ ఆటో ఓనర్ దగ్గరకు వెళ్లి వాకబు చేయగా.. ఆటో అప్పగించి వెళ్లిపోయినట్టు బదులిచ్చాడు. దీంతో మణికంఠ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెరైన్ ఎకో సిస్టం ఎంతో అవసరం


శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్‌ఎన్విరాన్‌మెంట్ అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు తరగతులను ప్రారంభించారు. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దసరా మహోత్సవాలకు శ్రీకారం

ఆరిలోవ: విజయదశమి మహోత్సవాలు సందడి ఆరిలోవ ప్రాంతంలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా శనివారం సంజయ్‌గాంధీకాలనీ, పెదగదిలిలో పండగరాటలు వేశారు. ఈ ఉత్సవాలు ఈ నెల 15 నుంచి 28 వరకు జరుపనున్నారు. సంజయ్‌గాంధీకాలనీలో దసరా సందర్భంగా కనకదుర్గ మాత ఉత్సవాలు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెదగదిలిలో ఈ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏయూ అభివృద్ధి భేష్


రమేష్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) డైరెక్టర్, ఏయూ పూర్వవిద్యార్థి వై.రమేష్ సందర్శించారు. ముందుగా ఏయూ గ్రంథాలయ విభాగం, ప్రభుత్వపాలన, రాజనీతిశాస్త్ర విభాగంలో వివిధ విభాగాల విద్యార్థులు, పరిశోధకులను ఉద్దేశించి ప్రసంగించారు. పరిశోధన పత్రాల ప్రచురణలో, పోస్ట్ డాక్టరల్ గ్రాంట్స్, ఫారిన్ ట్రావెల్ గ్రాంట్, డాక్టరల్ ప్రోగ్రామ్స్, రీసెర్చ్ ప్రాజెక్టులు మంజూరు చేయడం వంటి అంశాలను విపులంగా వివరించారు. ఏయూలో జరుగుతున్న వివిధ స్టార్టప్, ఇంక్యుబేషన్‌కేంద్రాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏయూ సిబ్, ఎలిమెంట్, అల్గారిథమ్, ఆ–హబ్‌లను సందర్శించారు.

అనంతరం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వై.రమేష్ మాట్లాడుతూ ఏయూని నూతన శిఖరాలకు తీసుకువెళ్లే దిశగా దార్శనికంగా పనిచేస్తున్న విధానాన్ని ప్రశంసించారు. ఏయూ నూతన మౌలిక వసతులతో విరాజిల్లుతోందన్నారు.ఐసీఎస్ఎస్ఆర్ అందించే వివిధ పరిశోధన సంబంధ ప్రాజెక్టులకు దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున రమేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.ధనరాజు, డాక్టర్ జి.శివ ప్రసాద్, జి.ప్రభాకర్, పి.వెంకటేశ్వర్లు, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ హరిబాబు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు


ప్రసంగిస్తున్న కన్నయ్య

ఏయూక్యాంపస్: బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు అని సమైక్యభారతి జాతీయ సమన్వయ కర్త పి.కన్నయ్య అన్నారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో అడివి బాపిరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ అడివి బాపిరాజు సాహిత్యం, వ్యక్తిత్వం చాలా గొప్పదని కొనియాడారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. సీనియర్ ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ అడివి బాపిరాజు విశిష్ట నవలా కారుడు, నాటక కర్త, కథకుడు, విశేష పాండిత్యంతో పాటు కరుణ కలిగిన మానవతా మూర్తని అన్నారు. ఆయన జీవితం సాహిత్యంపై తాను పరిశోధన చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర్ ఏ.ఈశ్వరమ్మ, బూసి వెంకటస్వామి, కె.రత్నశేఖర్, పి.లావణ్య , ఏ.వెంకటేశ్వర్లు (యోగి), పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్ ఏర్పాటు


మాట్లాడుతున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ(వీపీఏ) 90వ ఆవిర్భావ దిన వేడుకలు శనివారం పోర్ట్ వ్యాపార భాగస్వాములు, ఉద్యోగుల మధ్య పోర్ట్ గెస్ట్ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ పోర్ట్ అభివృద్ధికి పలు సూచనలిచ్చారు. త్వరలోనే పోర్ట్ వ్యాపార భాగస్వాముల సలహాలతో మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని సందర్శనకు నగర పౌరులకు కూడా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ కాంప్లెక్స్‌లో 90 ఏళ్ల కాలంలో పోర్ట్‌లో వినియోగించిన వస్తువులు, పురాతన వస్తువులతోపాటు 90 వసంతాల పోర్ట్ ప్రయాణాన్ని వివరించే ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల నిరసన

ఎంవీపీకాలనీ: టీడీపీ నేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా తూర్పు నియోజకవర్గ పార్టీ శ్రేణులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలో శనివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ అనైతికమన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతీ ఇంటా సంతోషం


పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ సంక్షేమ పథకలతో ప్రతి ఇంట సంతోషం కనిపిస్తోందని ఎంపీ, విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గడపగడపకు వెళ్తుంటే జగనన్న మమ్మల్ని లక్షాధికారులను చేశారని ప్రజలు సంతోషంగా చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. జీవీఎంసి 22వ వార్డులోని పిఠాపురం కాలనీలో వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. దేశం మెచ్చిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారని, ఆయన నేతృత్వంలో ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతానికి సహకరిస్తున్న అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జి జగ్గుపల్లి అప్పలరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ జ్యోషిలా, పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పేర్ల విజయ్ చందర్, పార్టీ నగర కార్యదర్శి బొక్కర శేఖర రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోణి రామకృష్ణ, ఎంవీవీ బాషా, ఉల్లంఘాల సూరిబాబు, రావాల ఎస్‌వి శశికళ, పైడి శ్రీను, పీతల మహేష్, సాసుబిల్లి కృష్ణ, ఒమ్మి శ్యాం , నిజాయిద్దీన్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల శతాబ్ది వేడుకలు


బాల కొండలరావుకు ఘంటసాల స్మారక పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో పురందేశ్వరి, శివమణి


అలరించిన నృత్యం

మద్దిలపాలెం: ఘంటసాల శతాబ్ది వేడుకలు మద్దిలపాలెం కళాభారతి శనివారం ఘనంగా జరిగాయి. చెన్నైకి చెందిన కళా ప్రదర్శిని సంస్థ వ్యవస్థాపకులు ఘంటసాల కోడళ్లు పార్వతీరవి, కృష్ణకుమారిరత్నల ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. ఘంటసాల ఆలపించిన మధురగేయాలకు పార్వతీ రవి ఘంటాల నృత్య నిర్దేశకత్వంలో అలరించాయి. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఘంటసాల స్మారక పురస్కారాలను నాట్య గురువులు ఏబీ బాలకొండలరావుకు, వేదాంతం రామలింగ శాస్త్రిలకు అందజేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ సంగీత సరస్వతి ముద్దు బిడ్డగా ఘంటసాల వేంకటేశ్వర రావు ఖ్యాతికెక్కారన్నారు. కార్యక్రమంలో రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్.జి.రఘురామారావు, డాక్టర్. సయ్యద్ రెహ్మతుల్లా, జాన్ మాస్టార్, ఘంటసాల స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, ఎంవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. అంతకుముందు శివమణి తన డ్రమ్స్ విన్యాసంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. శివమణి డ్రమ్స్ వాయిద్యానికి ఆడిటోరియం మార్మోగిపోయింది.

జూలో సందడి


వన్యప్రాణుల వేషధారణలో చిన్నారులు


ఎన్‌క్లోజరు బయట తిరుగుతున్న కనుజు

ఆరిలోవ: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కు సందడిగా మారింది. ఈ నెల 2న ఈ వారోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. పిల్లలు, పెద్దలకు వన్యప్రాణులకు సంబంధించిన అంశాలపై పోటీలు జరిపారు. ఇందులో భాగంగా శనివారం పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. దీంతో చిన్నారులను వివిధ వన్యప్రాణుల వేషధారణ అలరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం జూలో మారథాన్ నిర్వహించనున్నామన్నారు.


జూలో ఓ బాలుడు


వేషధారణలో అలంకరించిన పిల్లలతో తల్లిదండ్రులు



సెల్ఫీ విత్ టాపర్స్


విద్యార్థులతో సెల్ఫీ తీసుకొంటున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకరరావుతో కలి శనివారం సాయంత్రం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగిన ఎఫ్ఏ–2 పరీక్షలలో టాపర్స్‌గా నిలిచిన ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులతో ఆమె సెల్ఫీ తీసుకున్నారు.

దసరా ఉత్సవాల పందిరిరాట ప్రతిష్ట

ఎంవీపీకాలనీ: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని ఉత్సవాలు నిర్వహించేందుకు 18వ వార్డులో పందిరి రాట ను శనివారం ప్రతిష్ఠించారు. అప్పుఘర్ 92వ సచివాలయ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో 18వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పుక్కళ్ల ధనలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో పుక్కళ్ల శంకర్ పాల్గొన్నారు.

సందడిగా అంతరిక్ష వేడుకలు


ఇస్రో ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష వేడుకలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. మూడో రోజైన శనివారం ఇస్రో శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలో 1,450, వ్యాసరచనలో 985, పోస్టర్ ప్రజెంటేషన్‌లో 310, చిత్రలేఖనంలో 1,860 మంది కలిపి మొత్తం 4,605 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాకెట్ ప్రయోగాలు, అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి శాస్త్రవేత్తలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, షార్ ఆర్గనైజింగ్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న పర్యవేక్షించారు. అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఈ ముగింపు కార్యక్రమానికి డీఆర్‌డీవో నేవెల్స్ సిస్టమ్స్ మెటీరియల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ విజయనగరం వీసీ కె.వెంకట సుబ్బయ్య, ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ పి.వెంకటరెడ్డి తదితరులు హాజరుకానున్నారు.